సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. కేంద్రం నిర్వహణపై పాలకవర్గం దృష్టి సారించాలన్నారు. మునగపాకలోని సంపద తయారీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఇంతవరకు ఎంతమేర వర్మీ అమ్మకం జరిగిందనే విషయాలను సర్పంచ్ దిమ్మల అప్పారావును అడిగి తెలుసుకున్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా పాలకవర్గం పాటుపడాలన్నారు. ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, వార్డు సభ్యులు దాడి పోలీసు, విల్లూరి సకిరమనాయుడు పాల్గొన్నారు.


మునగపాక సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మురుగుకాల్వల్లో చెత్త వేయొద్దు

యలమంచిలి : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం యలమంచిలి మున్సిపాలిటీ కట్టుపాలెం గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను వేరు చేయడంపై వార్డులో మహిళలకు మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు. గ్రామంలో అక్కడక్కడ గల చెత్త కుప్పలను, మురుగుకాల్వల్లో చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టి దోమల నివారణ మందు పిచికారి చేయించారు. స్వచ్ఛ భారత్ స్వచ్ఛ సర్వేక్షణ 2023లో యలమంచిలి మున్సిపల్ కార్యాలయానికి మంచి ర్యాంక్ వచ్చే విధంగా ప్రజలు తోడ్పాటు అందించాలని, మురుగు కాల్వల్లో చెత్త వేయరాదని, ఇళ్లలో తడి చెత్త, పొడి చెత్త ప్రమాదకర చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలని వివరించారు. వార్డు కౌన్సిలర్ పందూరి హరినాథ్, మున్సిపల్ శానిటరీ అసిస్టెంట్‌లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


కట్టుపాలెంలో చెత్తను వేరు చేయడంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు

ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

రాంబిల్లి : రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో సి. సుమంత సూచించారు. బుధవారం ఆమె దిమిలి, కట్టుబోలు గ్రామాల పరిధిలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. వీఏఏలు మేఘన, ప్రశాంతిలకు ఏవో పలు సూచనలు చేశారు. ఈ క్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. వైఎస్సార్ పంటల బీమా, పంట నష్ట పరిహారం, ధాన్యం కొనుగోళ్లు వంటివి వర్తిస్తాయని ఏవో పేర్కొన్నారు. మామిడివాడ, దిమిలి, కట్టుబోలు గ్రామాల పరిధిలో వరినాట్లు పనులు జరుగుతు న్నాయన్నారు.

కోటవురట్ల: పంట వేసిన ప్రతి రైతు ఇ-క్రాప్‌లో పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి భీమిరెడ్డి సరోజిని కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గాను పంట నమోదు ప్రక్రియ జరుగుతోందని, ప్రతి రైతు తప్పనిసరిగా వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు తమ పరిధిలోని ఆర్బీకేలో పంట వివరాలు నమోదు చేయడం ద్వారా సిబ్బంది పంటను పరిశీలించి జియో ట్యాగ్ చేస్తారని, దాంతో పాటు ఈకేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. ఇందుకోసం ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, 1బి, మొబైల్ నంబరు తీసుకువెళ్లాలని సూచించారు. ఇ-క్రాప్ చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట నష్టపోతే బీమాగా పరిహారం వస్తుందని, సున్నా వడ్డీ పంట రుణం తీసుకునే సౌలభ్యం ఉంటుందని తెలిపారు.















నులి పురుగులను నులిమేద్దాం

- డీవార్మింగ్ డే నేడు
- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

రాంబిల్లి: నులి పురుగులు ఆరోగ్యానికి ఎంతో హానికరం. నులిపురుగుల కారణంగా పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు , విరోచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు కలుగుతాయి. నులిపురుగుల నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల వారికి ఉచితంగా ఆల్బెండజోల్(నులి పురుగుల నివారణ) మాత్రలు పంపిణీ చేస్తుంది. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రతి పీహెచ్‌సీ పరిధిలో గల ప్రతి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ పిల్లలకు మాత్రలు అందజేయనున్నారు. రాంబిల్లి పీహెచ్‌సీ పరిధిలో 4705 మంది, దిమిలి పీహెచ్‌సీ పరిధిలో 4338 మందికి మాత్రలు అందించేందుకు వైద్య సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

పరిశుభ్రతతోనే నివారణ

గోళ్లు చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలి. శుభ్రమైన నీటిని తాగాలి. ఆహారాన్ని ఎప్పుడూ కప్పి ఉంచాలి. కూరగాయలు, ఆకుకూరలను శుభ్రమైన నీటితో కడగాలి. తిన్న తరువాత, తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యులు సూచిస్తున్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు



నులిపురుగుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...

చూచుకొండ పరిధిలో నేడు...

మునగపాక : మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలో గురువారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ జరుగుతుందని వైద్యాధికారి ఎస్తేర్‌రాణి తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలందరికీ మాత్రలు అందజేస్తామన్నారు. 1856మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



నులి పురుగుల మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే పలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాం. డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలి.

– డాక్టర్ ఆర్. వెంకటేష్, దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి

ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎస్.రాయవరం : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న తీరును తెలుసుకున్నారు. నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రతి పథకం అందిందా? అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు సమాధానం ఇస్తూ పేద ప్రజల సమస్యలను పూర్తి స్థాయిలో గుర్తించిన నేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అని, నాయకులు, అధికారులు వెంట తిరగకుండా ప్రజలకు నేరుగా నగదు, పథకాలు అందజేశారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని, జగన్‌బాబుని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకర దేవి, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు సింహాద్రి, గుర్రం నానాజీ పాల్గొన్నారు.


కోనవానిపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదరాంభద్రపురం విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికల పై అవగాహన కల్పించడంలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థి నాయకుని (ఎస్‌పీఎల్) ఎన్నికలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థిని నక్కన సాయి భూలక్ష్మి పాఠశాల విద్యార్థి నాయకురాలిగా ఎన్నికై ంది. ఈ ఎన్నికలను సాధారణ ఎన్నికల మాదిరిగా బ్యాలెట్లు, బ్యాలెట్ బాక్స్ సిద్ధం చేసి నిర్వహించారు. 3 నుండి 10 వ తరగతి విద్యార్థుల వరకు అందరికీ ఓటు ఏ విధంగా వేయాలో, నచ్చిన అభ్యర్థిని ఏ విధంగా ఎన్నుకోవాలో వివరించారు. 100 శాతం ఓట్లు చెల్లుబాటు కావడం విశేషం. భద్రత, పోలింగ్ ఏజెంట్లుగా విద్యార్థులు వ్యవహరించగా, ఎన్నికల సిబ్బందిగా ఉపాధ్యాయులు వ్యవహరించారు. కార్యక్రమాన్ని వ్యాయమ ఉపాధ్యాయులు షేక్ రహమాన్, వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు, జి.భావనారాయణ, ఎస్.రవికృష్ణ, వెంకట అప్పారావు, నాయుడు, సత్యనారాయణ, దుర్గాభవాని పాల్గొన్నారు.


విద్యార్థులకు లీడర్ షిప్ ఎన్నిక నిర్వహించిన ఉపాధ్యాయులు

మహిళా కార్మికులకు పూర్తి భద్రత

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ మహిళా ఉద్యోగులకు రాకపోకల్లో పూర్తి భద్రత కల్పిస్తున్నామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు. ఆయన బ్రాండిక్స్ మహిళా కార్మికులు ప్రయాణిస్తున్న బస్సుల్లో ప్రయాణించి కార్మికుల బాగోగుల గురించి ఆరా తీశారు. మంగళవారం రాత్రి యలమంచిలి, ఎస్‌ఈజెడ్ కాలనీ, రాంబిల్లి ప్రాంతాలకు వెళ్లే బస్సుల్ని తనిఖీ చేశారు. బస్సుల్లో సీసీ కెమెరాలు, జీపీఆర్‌ఎస్, కమాండ్ అన్ కంట్రోల్ సెంటర్, బస్సు డ్రైవర్‌ల మొబైల్ అనుసంధానం గురించి వివరించారు. కొన్ని చోట్ల బస్సు దిగి కాలినడకన కార్మికులు కొంత దూరం వెళ్లాల్సి వస్తే ఆయా కుటుంబీకులు బస్సు ఆగే చోటకు వచ్చి సహకరించాలని కోరారు.


బ్రాండిక్స్ బస్సులో కార్మికులతో కలిసి ప్రయాణిస్తున్న బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి

సైన్స్ ప్రపంచ శాంతి కోసమే

- విధ్వంసం కోసం కాదు
- సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు జగదీష్
- విద్యార్థులకు అవగాహన సదస్సులు

యలమంచిలి : సైన్స్ ప్రపంచ శాంతి కోసం-విధ్వంసం కోసం కాదు అని సైన్స్ ఫర్ బెటర్ సోసైటీ అధ్యక్షుడు జగదీష్ అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణంలో గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానం మానవాభివృద్ధికి ఏవిధంగా తోడ్పడుతుందనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతి కుల మత విద్వేషాలకు తావులేకుండా దేశాల మధ్య ఘర్షణలకు తావులేకుండా యుద్ధాలు లేని ప్రపంచం కోసం ప్రజలంతా పాటుపడాలని అన్నారు. విజ్ఞానాన్ని కొన్ని దేశాలు వినాశనానికి ఉపయోగిస్తున్నాయన్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలో 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో జపాన్‌లోని హిరోషిమా నాగసాకీ నగరాలపై అణు దాడులు జరిగి నేటికి 78 ఏళ్లు గడిచిన నేపథ్యంలో ప్రపంచంలో నాటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలని పలు కళాశాలల్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.


సదస్సుకు హాజరైన విద్యార్థులు



చురుగ్గా ఓటరు సర్వే


బూత్ నంబర్ 211లో ఓటరు సర్వే చేపడుతున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో ఓటరు సర్వే చురుగ్గా సాగుతోంది. అచ్యుతాపురం మండల కేంద్రంలో బుధవారం బూత్ స్థాయిలో ఓటరు జాబితాలోని పేర్లను తనిఖీ చేశారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


రామగిరిలో సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేస్తున్న దృశ్యం

మునగపాక : అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు కోరారు. రామగిరిలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను ఆయన అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు, గర్భిణులకు మెరుగైన పోషకాహారం అందించేందుకు కిట్‌లను సరఫరా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత పల్లా రాజు పాల్గొన్నారు.











క్లుప్తంగా

మంత్రి రాజాకు పరామర్శ



మంత్రిరాజా తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

నక్కపల్లి : మాతృ వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజాను ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ తదితరులు బుధవారం పరామర్శించారు. మండలానికి చెందిన పలువురు నాయకులు మంత్రి రాజా ఇంటికి వెళ్లి సత్యనారాయణమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మంత్రిని పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు పాపారావు, సర్పంచ్‌లు భార్గవ్, వెంకటేష్, సురేష్‌వర్మ, సీనియర్ నాయకులు తాతారావు ఉన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం పంపిణీ



బాధిత మహిళకు రూ.10వేల నగదును అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : వైఎస్సార్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక బీసీ కాలనీకి చెందిన బీరా నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందడంతో బీమా పథకం కింద రూ.10 వేల నగదును బుధవారం అందజేశారు. మిగిలిన సొమ్ము రూ.90 వేలు నేరుగా నాగేశ్వరరావు భార్య అప్పలనర్సమ్మ బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంపీటీసీ రాము పాల్గొన్నారు.

వార్డు మెంబరుకు నామినేషన్లు దాఖలు



రేబాకలో వార్డు సభ్యుని ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : రేబాక పంచాయతీ ఒకటో వార్డు ఉప ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలయింది. బుధవారం ఒక నామినేషన్ దాఖలైందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. 10 వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. చినదొడ్డిగల్లులో కూడా ఒక వార్డు సభ్యుడి పదవికి ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉందన్నారు. అవసరమైతే ఈ నెల 19న ఉప ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

పచ్చదనం పెంపొందించాలి



అరబుపాలెంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. అరబుపాలెం గ్రామంలో బుధవారం ఆమె మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను విడనాడాలన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, ఎంపీడీవో మన్మథరావు,ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్, ఉపాధిహామీ ఏపీవో ఎరకయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

అనకాపల్లిటౌన్: మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన, ఉచిత కంటి పరీక్షలు జరిగాయి. శాఖ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ బృందం 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఐడ్రాప్స్ అందించారు.

నేలతల్లికి ప్రణామం... వీరులకు వందనం

- పలు గ్రామాల్లో నా భూమి...నా దేశం
- ఏటికొప్పాకలో విద్యార్థులతో ర్యాలీ
- మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం



ఏటికొప్పాకలో నాభూమి -నాదేశం కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము

యలమంచిలి : స్వాతంత్య్ర సమరయోధుల త్యాగ ఫలం ఫలితంగానే ఇప్పుడు సుఖ సంతోషాలతో జీవిస్తున్నామని యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణీ రాము అన్నారు. మండలంలో ఏటికొప్పాక గ్రామంలో బుధవారం నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏటికొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు.స్వాతంత్య్రం జాతీయ జెండా విశిష్టతపై గ్రామంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం అనే నినాదంతో సచివాలయం వద్ద గోడపై నాభూమి-నాదేశం సందేశాన్ని రాయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రవి, భజంత్రీలు రాము, బంగారుబాబు, కర్రి సంహాచలం, దిమిలి రమణబాబు, పెదపూడి కుమారి దేవరపల్లి రమణ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



చెర్లోపాలెంలోని అమరవీరులకు వందనం పేరిట శిలాఫలకం



పురుషోత్తపురంలో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ శేషు, ఎంపీడీవో అప్పలనాయుడు

పులపర్తి, పురుషోత్తపురంలో...

దేశ సమగ్రతకు నాయకుల కృషి ఫలితంగా దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చిందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. పులపర్తి గ్రామంలో నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం భవనం వద్ద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 15 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల ప్రకారం మండలంలో ప్రతి గ్రామంలో నాభూమి-నాదేశం అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. పురుషోత్తపురం గ్రామంలో వైస్ ఎంపీపీ రాజాన శేషు, ఎంపీడీవో అప్పలనాయుడుతో కలసి మొక్కలు నాటారు.



ఏటికొప్పాకలో నాభూమి-నాదేశం కార్యక్రమంలో విద్యార్థులతో ర్యాలీ

అమరవీరుల శిలాఫలకాల ఏర్పాటుకు చర్యలు

మునగపాక : స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవతున్న సందర్భంగా ప్రతి పంచాయతీ పరిధిలో శిలాఫలకాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. నా భూమి-నా దేశం పేరిట గ్రామాల్లో శిలా ఫలకాలు ఏర్పాటు చేస్తున్నారు. నేల తల్లికి నమస్కారం- అమరవీరులకు వందనం పేరిట నినాదాలు రాశారు. ప్రతి శిలాఫలకం ఆవరణలో 75 మొక్కలు నాటేలా కార్యక్రమాన్ని అధికారులు రూపొందిస్తున్నారు. ఆగస్టు 15వ తేదీన శిలాఫలకం వద్ద పతాకావిష్కరణ జరుగుతుందని ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి అమరవీరులను స్మరించుకుంటూ వారి సేవలను ప్రజలకు వివరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



చందనాడలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

సహజవనరులను కాపాడుకోవాలి

నక్కపల్లి : నామట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం చందనాడ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సహజ వనరులను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. బుధవారం వారు చందనాడలో సచివాలయ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, వలంటీర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నానాజీ, సర్పంచ్ తళ్ల భార్గవ్, జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.



కె.వెంకటాపురంలో మహనీయులను స్మరించుకుంటున్న నాయకులు, అధికారులు, విద్యార్థులు

వెంకటాపురంలో...

కోటవురట్ల: మహనీయులను స్మరించుకునేలా ప్రతి ఒక్కరూ ఉద్యమంలా మొక్కలు నాటాలని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. బుధవారం నాభూమి-నాదేశం కార్యక్రమం ప్రారంభించారు. కె.వెంకటాపురంలో అమరవీరుల శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి మహనీయులను స్మరించుకుంటూ సెల్యూట్ చేశారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో 75 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. వీటి సంరక్షణ బాధ్యతను స్థానిక ప్రజా ప్రతినిధులు తీసుకోవాలని, ఆరోగ్యకర వాతావరణానికి కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, ఏపీవో గంగునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: నాభూమి-నాదేశం కార్యక్రమం గురువారం మండలంలోని ఆరు గ్రామాలలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. బి.కె.పల్లి, జల్లూరు, సుంకపూరు, యండపల్లి, తంగేడు, అన్నవరం గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రాంబిల్లి: మండలంలోని రజాల, కుమ్మరాపల్లి, మురకాడ, దిమిలి, కట్టుబోలు, మామిడివాడ, కొత్తూరు గ్రామాల్లో నా భూమి- నా దేశం శిలాఫలకాలను ఆవిష్కరించి స్వాంతంత్య్ర సమరయోధులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, వైస్ ఎంపీపీ కె.లక్ష్మివడ్డికాసులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే పావలా వడ్డీకే రుణాలు



రైతులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక : కిసాన్ క్రెడిట్ కార్డులున్న ప్రతి రైతుకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. 18 నుంచి 75 సంవత్సరాల లోపు వయస్సున్న రైతులు ఈ పథకానికి అర్హులుగా ఆయన పేర్కొన్నారు. బుధవారం రైతుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి భూమికి సంబంధించిన పత్రాలు లేకుండా రూ.1,60,000 మేర రుణం అందుతుందన్నారు. ఆపై దాటితే భూమికి సంబంధించి పత్రాలు ఉండాలన్నారు. గరిష్ట పరిమితి రూ.3 లక్షలు ఉంటుందన్నారు. మండలాల పరిధిలోని బ్యాంక్‌ల ద్వారా రుణ సదుపాయం అందుతుందన్నారు. వడ్డీ 7 శాతం (సుమారు 25 పైసలు) ఉంటుందన్నారు. తీసుకున్న రుణం ఏడాదిలోపు చెల్లించేటట్టయితే ఇంటరెస్ట్ సబ్వెన్షన్ స్కీమ్ కింద నాబార్డు లేదా ఆర్‌బీఐ 3 శాతం రైతుల ఖాతాలో వడ్డీ అమౌంట్ జమ అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రదీప్‌కుమార్ కోరారు.

'పీఆర్‌టీయూ' ఎన్నిక ఏకగ్రీవం



మండల పీఆర్‌టీయు కమిటీకి ఎన్నికైన సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండల పీఆర్‌టీయు మండల శాఖ ఎన్నిక బుధవారం ఏకగ్రీవం అయ్యింది. పెద గుమ్ములూరు పాఠశాలలో జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపినాథ్ సమక్షంలో ఎంపిక జరిగింది. మండలశాఖ అధ్యక్షుడు వీరభద్రరావు, కార్యదర్శి వి.వి. శ్రీనివాసరావు, కోశాధికారి జాన్‌శ్యామల్ ఎంపికైనట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మద్దు శ్రీను, విశేశ్వరరావు, పెద్ది నాయులు, రామారావు , చోడిశెట్టి సత్యనారాయణ, జాన్, రమేష్, కొండాబ్బాయి, పీఈటీ నిర్మల పాల్గొన్నారు.

పామాయిల్ తోట, పైప్‌లైన్ ధ్వంసంపై ఫిర్యాదు



పొక్లెయిన్‌తో తవ్వేసిన పైప్‌లైన్

మునగపాక: కాకరాపల్లిలో పామాయిల్ తోట, పైప్‌లైన్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు నాగిరెడ్డి బుధవారం మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 186లో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న స్థలంలో పామాయిల్ తోట పెంపకంతో పాటు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం పొక్లెయిన్‌తో పైప్‌లైన్‌ను, పామాయిల్ తోటను కూడా ధ్వంసం చేసినట్టు బాధితుడు నాగిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ కారణంగా తనకు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. కాగా ఈ విషయమై ఎస్‌ఐ ఆలీని సంప్రదించగా రెండు వర్గాల మధ్య గతంలో ఫిర్యాదులు చేసుకున్నారని, ప్రస్తుతం ఈ వివాదానికి సంబంధించి కోర్టులో కూడా కేసు ఉందని తెలిపారు.

ఘనంగా లలితాదేవి కలశ ఊరేగింపు



గవరపేటలో లలితాదేవి కలశ ఊరేగింపు



శారదానదిలో ప్రత్యేక పూజలతో కలశ నిమజ్జనం

కశింకోట: కశింకోటలోని గవరపేటలో ఉన్న శారదా గణపతి రామాలయంలో ఏర్పాటు చేసిన లలితాదేవి కలశ నిమజ్జనోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి రోజున లలిత సహస్ర నామ పారాయణ కార్యక్రమాన్ని మండల దీక్షగా జరిపారు. 41 రోజులపాటు జరిగిన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. దీంతో కలశాన్ని భజనలతో ఊరేగించి, పూజలు జరిపి శారదా నదిలో నిమజ్జనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



గ్యాస్ లీక్ నుంచి వస్తున్న మంటల్ని మహిళ చేత అదుపు చేయిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్: అగ్నిప్రమాదాలు, వాటి నియంత్రణపై స్థానిక సత్యసాయి సేవాసమితి మందిరంలో బుధవారం అగ్నిమాపక అధికారులు డెమో నిర్వహించారు. అగ్నిమాపక అధికారి బి.నర్సింగరావు అగ్ని ప్రమాదాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.గ్యాస్ లీకేజీ సమయంలో మంటలు వ్యాపిస్తే వాటిని ఎలా అదుపులోకి తీసుకురావచ్చో అగ్నిమాపక సిబ్బంది స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ అన్నం శివరాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బాబూరావు సందర్శన

ఎస్.రాయవరం : పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు జన్మదిన వేడుకలు పురస్కరించుకుని గురువారం కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉదయం 8 గంటలనుంచి అధికారులు, పార్టీ నాయకులు, అభిమానులు కలవవచ్చని పార్టీవర్గాలు చెప్పారు.

ఆదివాసీ దినోత్సవం రోజున వినూత్నంగా..



ఆకులు చుట్టుకుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

కోటవురట్ల: అణుకు గిరిజనులు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద గిరిజనులు ఆకులు చుట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ 34 రోజులుగా గిరిజనులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అయినా వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

ఘనంగా కాపు సంక్షేమ సేన ఆవిర్భావ వేడుకలు



కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక దినోత్సవాన కేక్ కట్ చేసి తినిపిస్తున్న నగిశెట్టి గంగబాబు

అనకాపల్లిటౌన్: స్థానిక కోట్నివీధి కల్యాణమండపంలో కాపు సంక్షేమ సేన మూడవ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సేన జిల్లా అధ్యక్షుడు నగిశెట్టి గంగబాబు బుధవారం రాత్రి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేన వ్యవస్థాపకులు హరిరామ జోగయ్య పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించేలా కాపులందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేన జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లవిల్లిరామ కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కాశివ శంకర్రావు, జిల్లా యూత్ అధ్యక్షుడు యల్లంశెట్టి చిరంజీవి, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

12న టీచర్ల మహాధర్నా

అనకాపల్లి రూరల్: ఈ నెల 12న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాకు టీచర్లంతా హాజరై విజయవంతం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ గొంది చిన్నబ్బాయి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లు కావస్తున్నా ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సీపీఎస్ రద్దు, జీవో 117 సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు వై సుధాకర్‌రావు, ఎస్.సన్యాసినాయుడు, రవీంద్రబాబు, సీహెచ్ నాగేశ్వరరావు, ప్రేమ్ కుమార్, వత్సవాయి శ్రీలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విధులకు హాజరవ్వాలి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

ఎస్.రాయవరం : సచివాలయ సిబ్బంది సకాలంలో సచివాలయాలకు వచ్చి విధులు నిర్వర్తించాల్సిందేనని డీఎల్‌డీఎల్ ఎం.ఉదయశ్రీ అన్నారు. వమ్మవరం గ్రామ సచివాలయాలని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కొందరు మాత్రమే అందుబాటులో ఉండడంతో ఎవరు ఎక్కడ ఉన్నారని ఆరా తీశారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించాలని, ఏ ఒక్కరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సమీపంలో అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణను పరిశీలించారు. సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ధ్రువపత్రాలు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం కారణంగా గ్రామాల్లో పలువురు దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని అర్హులకు, ఆయా ధ్రువపత్రాలు అవసరమైన వారి కోసం జగనన్న సురక్ష ఏర్పాటు చేశారు. జూన్‌లో వారం రోజుల్లో పాటు గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆయా వార్డుల్లోను గ్రామాల్లోను పర్యటించి సంక్షేమ పథకాలు అందని అర్హులను, ధ్రువీకరణ పత్రాలు కావలసిన వారిని గుర్తించి నమోదు చేసుకున్నారు. వీటిపై పరిశీలించి, అర్హులకు ధ్రువీకరణ పత్రాలను జూలై నెల ప్రారంభం నుంచి ఆయా గ్రామాల్లోను, వార్డుల్లోను చేపట్టిన సురక్ష కార్యక్రమాల్లో అర్హులకు అందించడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూలై ప్రారంభం నుండి జూలై 28 వరకు మండలంలో గల 24 గ్రామాల పరిధిలోను 25 గ్రామ సచివాలయాల్లో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు అందనివారు, ప్రజలకు అవసరమైన జనన, మరణ, వివాహ, వారసత్వ, భూహక్కు, ఆధార్‌కు ఫోన్ నెంబరు అనుసంధానం తదితర 11 అంశాలతో కూడిన అవసరాల కోసం అర్హులు ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నారు. వారం రోజుల్లో వీటిని పరిశీలించి, అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. మండలంలో 7880 మంది ఆయా పథకాల కోసం, ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు చేసుకోగా వీరికి అర్హత ధ్రువీకరణ పత్రాలను అందించారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, దళారుల చుట్టూ, మండల కేంద్ర కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అధికారులు, నాయకులు అందించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో మంచి కార్యక్రమం



జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమం. మీ సేవా కేంద్రాలకు, సచివాలయాలకు, మండల కార్యాలయాలకు తిరగకుండా సమస్యలు గ్రామంలో ఇంటికి వచ్చి నమోదు చేసుకుని, పరిష్కరించడం ఎంతో ఆనందం. కులం, ఆదాయ ధ్రువపత్రాలు ఎంతో సులభంగా అందించారు.

– మండపల్లి సత్యవతి, పి.ఎల్.పురం, పాయకరావుపేట మండలం

ఉచితం సేవలు పొందాను...



జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కరించడం ఎంతో సంతోషం. నేను ఆధార్ నంబర్‌కి ఫోన్ నంబరు అనుసంధానం చేయించుకున్నాను. ఎలాంటి రుసుము లేకుండా సర్వీస్ చేయడం అభినందనీయం.

– ఎం.దుర్గాభవాని, పి.ఎల్.పురం

మహిళలకు వజ్రాయుధం దిశయాప్

- అసాంఘిక కార్యకలాపాలపై నిఘా
- డీఎస్పీ సత్యనారాయణ



సబ్బవరం: మహిళలు, బాలికలపై ఎవరైనా దాడులు చేసినా, అసభ్యకరంగా ప్రవర్తించినా తీవ్రమైన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ పదలో ఉన్న మహిళలకు దిశ యాప్ వజ్రాయుధంలా ఉపయోగపడుతుందన్నారు. దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీస్‌లకు సమాచారం అందిస్తే పోలీసులు వారికి రక్షణగా నిలుస్తారని చెప్పారు. జాతీయ రహదారులను ప్రమాదరహితంగా తీర్చిదిద్దేందుకు హైవే పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతూ ఉండాలని అనకాపల్లి ఎస్పీ ఆదేశించినట్లు తెలిపారు. దీంతో సబ్బవరంలోని జాతీయ రహదారితో పాటు దానికి అనుసంధానమైన ప్రధాన రహదారుల్లో నిత్యం హైవే పెట్రోలింగ్ వాహనం తిరుగుతూ పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తోందన్నారు. వీటితో ప్రధాన రహదారుల్లో ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి రేడియం స్టిక్కర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు డీఎస్పీ చెప్పారు. గంజాయి అక్రమ రవాణా మండలం మీదుగా వెళ్లకుండా నిత్యం నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అక్రమ తరలింపులో భాగస్వాములుగా ఉన్న పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదంతో అణచివేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. యువత రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.చిన్న పిల్లలు, మహిళల హక్కులను కాపాడి వారికి నిరంతరం రక్షణగా నిలవడం జరుగుతుందన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ జరగకుండా కళాశాలలు, స్కూళ్ల వద్ద మహిళా పోలీస్‌లను మఫ్టీలో ఉంచామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.